క్లుప్తంగా

కనీస వేతనం అమలు చేయాలి



కోస్గి: ప్రభుత్వం నిబంధనల మేరకు మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి ప్రతి నెల 5వ తేదీలోపు వేతనం అందించాలన్నారు. ప్రజలకు అందిస్తున్న సేవల్లో కీలక భూమిక పోషిస్తున్న మున్సిపల్ కార్మికులను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. మున్సిపల్ కార్మికులు నారాయణ, ధశరథ్, అంజప్ప, శ్రీనివాస్, బుగ్గప్ప పాల్గొన్నారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించండి



నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని స్థానిక 3వ వార్డు పరిధిలో ఉన్న సరస్వతి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు లేక ఇబ్బంది పడుతున్నారని, అదే విధంగా సామూహిక అవసరాల కోసం అంగన్‌వాడీ కేంద్రం, పార్కు, కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మున్సిపల్ కమిషనర్‌ను సరస్వతి కాలనీలో పర్యటించి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గోవింద్‌గేరి లక్ష్మీకాంత్, వెంకట్రామిరెడ్డి, శివారెడ్డి, గుట్టమీది నారాయణ, తిరుపతయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'100కు డయల్ చేస్తే వెంటనే స్పందిస్తాం'



మక్తల్: బాధితులు పోలీసుల సాయం కోసం 100కు డయల్ చేస్తే వందశాతం స్పందిస్తామని మక్తల్ సీఐ రాంలాల్ అన్నారు. నారాయణపేటకు చెందిన లాలు అనే యువకుడు దామరగిద్దలోని అత్తగారి ఇంట్లో గొడవ పడి క్షణికావేశంలో మక్తల్‌లోని రైల్వేట్రాక్‌పై ఆత్మహత్య చేసుకోబోయాడు. అయితే అతడి మేనమామ పోలీసులకు సమాచారం ఇవ్వగా మక్తల్ ఎస్ భాగ్యలక్ష్మిరెడ్డి వెంటనే పెట్రోలింగ్‌లో ఉన్న కానిస్టేబుళ్లు నరేశ్, శ్రీహరికు విషయం చెప్పారు. దీంతో వారు వెంటనే స్పందించి రైల్వేట్రాక్‌పై పడుకొని ఉన్న యువకుడిని కాపాడారు. ఈ సందర్భంగా సోమవారం సదరు కానిస్టేబుళ్లను సీఐ రాంలాల్ శాలువాతో సన్మానించారు. ప్రజలకు బాధ్యతాయుత సేవలందించడానికే పోలీసులు ఉన్నారని, డయల్ 100కు ఎప్పుడు ఫోన్ చేసినా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పండుగ తర్వాత శిక్షణ ఇవ్వాలి

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణ శిబిరాలను దసరా పండుగ తర్వాత ఏర్పాటు చేయాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పగడాకుల బాలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కోటకొండలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. విజయదశమి పండుగ వేళ ప్రభుత్వ ఉపాధ్యాయులను స్థానిక ఎన్నికల శిక్షణ పేరుతో ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఇప్పటికే చాలామంది సొంత గ్రామాలకు వెళ్లి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి పండుగ వాతావరణంలో ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరారు.

దోరేపల్లి వాసికి డాక్టరేట్

మద్దూరు/నారాయణపేట: మండలంలోని దోరేపలికి చెందిన సర్వేయర్ ఆవుటి మల్లేష్‌కు వారణాసిలోని బనారస్ హిందూ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించినట్లు ఆయన సోమవారం తెలిపారు. 'భూగర్భజలాల లభ్యత, ఉపరితల భౌగోళిక శాస్త్రాన్ని ప్రతిబింబించే అంశం'పై భూగర్భ శాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ సందీప్ ముఖర్జీ నేతృత్వంలో చేసిన పరిశోధనలకు గాను డాక్టరేట్ వచ్చిందన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

స్వగ్రామం ఒకటి.. రికార్డుల్లో మరొకటి



మొగ్దుంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

- ఆధార్, పట్టా పాసుపుస్తకాల్లో ఇతర గ్రామాల పేర్లు
- ఇబ్బందుల్లో విద్యార్థులు, రైతులు

ఊట్కూర్: ప్రభుత్వం పాలన సౌలభ్యం కోసం చిన్న, చిన్న గ్రామాలను సైతం పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అయితే ఆ గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఊట్కూర్ మండలంలోని పెద్దజట్రం శివారులో అవుసలోనిపల్లి, మొగ్దుంపూర్ గ్రామాల రైతులకు చెందిన భూములు కలవు. అయితే వారి పట్టా పుస్తకాల్లో, ఆధార్ కార్డులో మాత్రం ఊరి పేరు పెద్దజట్రం చూపిస్తుంది. దీంతో రైతులు, విద్యార్థులు సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దీంతో అన్నదాతలు సమస్య పరిష్కారం కోసం ఏళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు.

మూడు మండలాలకు తిరగాల్సిందే

అవుసలోనిపల్లి గ్రామం పెద్దజట్రం గ్రామ పంచాయతీ పరిధిలో ఆమ్లేట్ గ్రామంగా ఉండేది. 1984లో నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడింది. గ్రామంలో 1600 మంది ఓటర్లు, 4 వేల జనాభా ఉన్నారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలతో పాటు 3 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అలాగే గ్రామంలో 350 మంది రైతులు ఉండగా 1800 ఎకరాలు భూమి కలిగి ఉన్నారు. వీరి భూములంతా నారాయణపేట మండలంలోని కొల్లంపల్లి, ధన్వాడ మండలంలోని పాతపల్లి, పెద్దజట్రం, బిజ్వార్ రెవెన్యూ గ్రామాల్లోని రికార్డులో ఉన్నాయి. దీంతో ఏదైనా అవసరం ఏర్పడితే మూడు మండల కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు తప్పని తిప్పలు

మొగ్దుంపూర్ గ్రామం గతంలో పెద్దజట్రం గ్రామ పరిధిలో ఆమ్లేట్ గ్రామంగా ఉండేది. 25 ఏళ్ల క్రితం గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. గ్రామంలో 880 ఓటర్లు, 1600 జనాభా ఉన్నారు. 300 మంది రైతులు 1500 ఎకరాల భూమి ఉంది. భూములు మాత్రం పెద్దజట్రం, ఏర్గాట్‌పల్లి రెవెన్యూ గ్రామాల రికార్డుల్లో చూపిస్తున్నాయి. ఆధార్ కార్డు, పట్టా పుస్తకాల్లో కూడా ఇతర గ్రామాల పేర్లు వస్తున్నాయి. విద్యార్థులకు కుల, ఆదాయ ధృవపత్రాల్లో సైతం గ్రామం పేరు రాకపోవడంతో సంక్షేమఫలాలు అందడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సర్వే చేసినప్పటికీ..

1996లో తాను సర్పంచ్‌గా ఉన్నప్పుడు రెవెన్యూ గ్రామాల విభజనకు ప్రభుత్వం సర్క్యూలర్ విడుదల చేసింది. అధికారులు రెవెన్యూ గ్రామాల నక్షా ప్రకారం భూములు విభజన చేసి భూ పరిపాలన అధికారులకు నివేదికలు పంపించారు. కానీ ఇంత వరకు విభజన చేయలేదు. మంత్రి వాకిటి శ్రీహరి స్పందించి సమస్యను పరిష్కరించాలి.

–వెంకటయ్య, అవుసలోనిపల్లి

ఇబ్బందులు పడుతున్నాం..

ఆధార్ కార్డు, పట్టా పాసుపుస్తకాల్లో మొగ్దుంపూర్‌కు బదులుగా పెద్దజట్రం అని రావడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. కుల, ఆదాయ ధృవపత్రాల్లో సైతం పెద్దజట్రం రావడంతో ఆన్‌లైన్ నమోదుకు, బ్యాంకులో రుణాలకు, విద్యార్థుల ఉన్నత చదువులకు ఇబ్బందులకు గురవుతున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

–నారాయణ, మొగ్దుంపూర్

నివేదిక పంపించాం..

మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు అవుసలోనిపల్లి, మొగ్దుంపూర్ రెవెన్యూ గ్రామాల ఏర్పాటుకు గిర్దావర్‌తో నివేదిక తయారు చేయించాం. పెద్దజట్రం శివారులో సర్వే నెం .887, విస్తీర్ణం 6725–20 ఎకరాలు ఉంది. ఈ భూములపై కలెక్టర్, సీసీఎల్‌కు నివేదిక అందజేశాం. ఉన్నతాధికారుల ఆదేశాలు వస్తే రెవెన్యూ గ్రామాలుగా ఏర్పాటు చేస్తాం.

–చింత రవి, తహసీల్దార్, ఊట్కూర్

సొసైటీకి రైతులే యజమానులు



మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నర్వ: ప్రాథమిక సహకార సంఘం సొసైటీకి రైతులే యజమానులని పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నర్వ ప్రాథమిక సహకార సంఘం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడారు. సొసైటీలో 8500 మంది రైతులున్నారని అందరూ సంఘాన్ని బలోపేతం చేసేందుకు సహకరించాలన్నారు. గత మూడు సీజన్లకు సంబంధించిన హమాలీ డబ్బులను రైతులకు అందిస్తామన్నారు. రూ. 8 లేదా రూ.6 వరకు రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు 20,365 బస్తాల యూరియాను రైతులకు అందించామన్నారు. మిగిలిన రైతులకు రెండో రోజుల్లో సరఫరా చేస్తామని ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. గతంలో సొసైటీలో జరిగిన అవకతవకలపై విచారణ జరుగుతుందన్నారు. అనంతరం ఆత్మకూర్ డీసీసీబీ మేనేజర్ ఏ. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. నర్వ సొసైటీలో 890 మంది రూ.2 కోట్ల వరకు రుణబకాయిలుండగా ఇప్పటి వరకు కేవలం 58 మంది మాత్రమే బకాయిలు చెల్లించారన్నారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సహకరించాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ లక్ష్మన్న, డైరెక్టర్‌లు రామేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వివేకనందారెడ్డి, పల్లెశేఖర్, లింగన్న, రాములునాయక్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతు సదస్సును విజయవంతం చేయండి

మద్దూరు: రైతులకు వ్యతిరేకంగా కేంద్రం అనుసరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 30న జిల్లా కేంద్రంలో నిర్వహించే రైతు సదస్సును విజయవంతం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం అప్పిరెడ్డిపల్లిలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం డివిజన్ కార్యదర్శి నర్సింములు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్ల దేశంలోని వ్యవసాయ రంగం సంక్షోభానికి గురవుతుందని, వెంటనే ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పత్తిపై ఉన్న దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించి స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మాస్‌లైన్ పార్టీ నాయకులు మల్లేష్, వెంకటప్ప, హన్మప్ప, రాములు, కృష్ణ, అంజిలప్ప పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు

గిరిజనుల హక్కుల సాధనకు కృషి



నారాయణపేట రూరల్: గిరిజనుల హక్కుల సాధనకు సమిష్టిగా కృషి చేద్దామని గిరిజన నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం బంజారా రిజర్వేషన్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సుభాష్ రోడ్ వారం బావి నుంచి సిటిజన్ క్లబ్ వరకు లంబాడీలు ఆత్మగౌరవ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలని ప్రయత్నాలు చేస్తున్న ఎమ్మెల్యేలను కాంగ్రెస్.. పార్టీలోకి ఆహ్వానించడంపై మండిపడ్డారు. కాంగ్రెస్ లంబాడీల ఓట్లతో అధికారంలోకి వచ్చి, 2017లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ప్రాంతంలో హింసాత్మక ఘటనకు పాల్పడిన సోయం బాబురావు, తెల్లం వెంకట్రావును పార్టీలోకి చేర్చుకోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ ఇద్దరు నాయకులు లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలని రిట్ పిటిషన్ దాఖలు చేశారని ఇది లంబాడీల ఆత్మగౌరవానికి వ్యతిరేకమన్నారు. ఈ అంశంపై టీఆర్ఎస్, బీజేపీ నాయకులు తమ వైఖరిని స్పష్టం చేయాలన్నారు. గిరిజన నాయకులు నానవత్ రాజు నాయక్, వల్య నాయక్, సీతారాం నాయక్, క్రాంతి నాయక్, కిష్ట్యా నాయక్, లక్ష్మన్ నాయక్, నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



కోస్గిలో బతుకమ్మ వేడుకలు జరుపుకొంటున్న మహిళలు, యువతులు

మద్దూరు: పట్టణ కేంద్రములోని చౌడేశ్వరి ఆలయంలో సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు సాంప్రదాయ వస్త్రధారణతో పాల్గొని బతుకమ్మలను పేర్చి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా దేవాలయ పరిసరాల్లో పూల రంగవల్లులు దీపాలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

ఆకట్టుకున్న బతుకమ్మ ప్రతిమ

కోస్గి: 'బతుకమ్మ..బతుకమ్మ ఉయ్యాలో..బంగారు బతుకమ్మ ఉయ్యాలో' అంటూ సోమవారం పట్టణంలో బతుకమ్మ పూల పండుగను వేడుకగా జరుపుకొన్నారు. పలు కాలనీలకు చెందిన మహిళలు, యువతులు తీరొక్క పూలతో అందంగా అలంకరించి కోలాటాలు, బతుకమ్మ పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో బతుకమ్మలను ఊరేగించారు. మున్నూర్ వీదిలో 5 అడుగుల ఎత్తుతో ప్రత్యేకంగా అలంకరించిన బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలవగా కాలనీ యువతులు ట్రాక్టర్‌లో ఊరేగిస్తూ ఆడిపాడి ఆకట్టుకున్నారు. ఊరడమ్మ గుడి, గొల్లబావి చౌరస్తాలో ఆడిపాడారు. అనంతరం తోగపూర్ గ్రామ పరిధిలోని దండం చెరువులో నిమజ్జనం చేశారు.

దామరగిద్ద: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారి సుదేష్ణ ఆధ్వర్యంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలకు డీఎంహెచ్ఓ చంద్రమోహన్ హజరైయ్యారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్‌లు బాలాజీ, సుదేష్ణ, ఫార్మసిస్ట్ వెంకట్రామరెడ్డి, సీహెచ్ఓ నారాయణ,ఎంఎల్‌ఎచ్‌పీ వైద్యులు సోయల్, హరిచందన, యశోధ, ఏఎన్ఎంలు ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని మాజీ సర్పంచు అరుణశ్రీ ఇంటి ఆవరణలో బతుకమ్మను తయారు చేసి వాటి చుట్టు బోడెమ్మలు వేస్తూ నృత్యం చేశారు. అనంతరం వాటిని ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక వెంకట్రమణ బావిలో నిమజ్జనం చేశారు. అలాగే ధన్వాడ ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో డీఎంహెచ్ఓతో పాటు డాక్టర్ అనుష, కథలప్ప, మునిర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక బతుకమ్మతో యువతులు



దామరగిద్దలో..



ధన్వాడలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

చెరువుకు పడిన గండి పూడ్చివేత

కొత్తపల్లి: మండలంలో భూనీడు శివారులోని మర్రికుంట చెరువు తూము దగ్గర పడిన గండిని అధికారులు సోమవారం పూడ్చివేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువుకు గండి పడగా సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలో ఇరిగేషన్ అధికారులు సోమవారం గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించి గండి పడిన కట్టను మట్టితో పూడ్చివేశారు. ఈ చెరువు కింద దాదాపు 100 ఎకరాల్లో వరి సాగు అవుతుండగా నీరు పంట పొలాల్లోకి ప్రవేశించి పలు ఎకరాల్లో పంట నీట మునిగింది. అయితే ఇరిగేషన్ అధికారులు గండిని పూడ్చి వేయడంతో సాక్షి దినపత్రికకు గ్రామస్తులు, ఆయకట్టు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..



గండిని పూడుస్తున్న సిబ్బంది

సరస్వతీ మాత అలంకరణలో అమ్మవారు



సింగారం శ్రీగిరి పీఠంపై..



జాజాపూర్‌లో ..

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. జిల్లా కేంద్రంలోని స్థానిక సరాఫ్ బజార్‌లో ప్రతిష్ఠించిన దుర్గామాతను బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత నాగూరావ్ నామాజీతో పాటు గణేష్ ఉత్సవ సమితి, వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ సభ్యులు దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించారు.

అమ్మవారిని దర్శించుకున్న నటి

జిల్లా కేంద్రంలోని శ్రీ సంత్ మత మూల మహా సంస్థానం శక్తి పీఠం ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో సినీ నటి సంధ్యారాణి పాల్గొన్నారు. సోమవారం మహా లక్ష్మీదేవి అవతారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని సూక్త హోమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. తదనంతర మహానివేదన సమర్పణ చేసి మంగళహారతి అందించారు.

నారాయణపేట రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 8వ రోజు సోమవారం అమ్మవారు భక్తులకు సరస్వతీ మాతగా దర్శనమిచ్చారు. మండలంలోని సింగారం గ్రామ శ్రీగిరి పీఠంపై భవానిమాత ఆలయంతో పాటు కోటకొండ వాసవిమాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే జాజాపూర్ గ్రామ ఈశ్వర్ మందిర్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి నోటు పుస్తకాలు, పెన్నులు అందించారు.

నర్వ: దుర్గనవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం దుర్గమాత మహాచండిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా నర్వ, లంకాల్, పెద్దకడ్మూర్, బెక్కర్‌పల్లి, రాంపూర్, కుమార్‌లింగంపల్లి, ఉందేకోడ్, రాయికోడ్, ఎల్లంపల్లి, ఆచ గ్రామాల్లో దుర్గమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్వ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

మరికల్: దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు సోమవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీవాణి పాఠశాల ఆవరణలో అమ్మవారి ముందు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి ప్రత్యేక పూజలు చేశారు.



మరికల్‌లో సరస్వతీదేవి అలంకరణలో ..



నర్వలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం



నారాయణపేటలో దుర్గామాతను దర్శించుకున్న నాయకులు

నిందితులపై చర్యలు తీసుకోవాలి

మద్దూరు: కంటి వైద్య నిపుణుడు రమేష్ నాయక్ సూసైడ్ నోట్ రాసి అదృశ్యమైన ఘటనలో నిందితులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకటయ్య, పార్టీ అధ్యక్షుడు శంకర్, నాయకులు సాయిలు, రాఘవేందర్, బాలకృష్ణ, భరత్, ప్రశాంత్, ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆర్ఎంపీ వైద్యుడు తాజోద్దీన్, అతడి తమ్ముడు యాసిన్ వేధించడంతోనే రాంచంద్రయ్య ఆత్మహత్య చేసుకోగా అతని మిత్రుడు రమేష్‌నాయక్ లెటర్ రాసి అదృశ్యమయ్యాడన్నారు. ఒక వ్యక్తి ఆత్మహత్య.. మరొక వ్యక్తి అదృశ్యమవడానికి కారకులైన ఇద్దరిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి విచారణ జరిపి దోషులను శిక్షించాలన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు



గొయ్యి.. పూడ్చే నాథుడు కరువై..

మహబూబ్‌నగర్-రాయచూర్ వెళ్లే ప్రధాన జాతీయ రహదారిపై గుంతపడి మూడేళ్లు అవుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. గొయ్యిని పూడ్చకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. రాత్రి సమయంలో బైక్‌లు అదుపు తప్పి గుంతలో పడి పలువురు తీవ్రంగా గాయపడిన ఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించకపోవడంతో చివరికి పోలీసులే గుంతలో చెట్ల కొమ్మలు, రాళ్లు, మట్టి సంచులను పెట్టి ప్రమాదాలను కొద్ది వరకు నివారిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. - మరికల్